# సుందరి

శ్రీమతి పి. రుక్మిణీబాయిగారు

## ౧

విస్సన్నగారికి తొంభయ్యో పడి వచ్చింది. శివపూజార్చకుడుగా ఉండి, చిన్నప్పటినుండి కాయకష్టాలుపడి ఐదార్వేల రూపాయల నగదున్ను, సుమారు ఇరువది ఎకరాల భూమిన్ని సంపాదించి ఉన్న ఆస్తి యావత్తు తన కుమారుడు రామన్నకు ఒప్పగించి పరలోకగతుడయినాడు. సహజంగా వృద్ధురాలగుటచేత విస్సన్నగారి భార్య భర్తపోయిన ఏణ్ణర్ధంలోపుగానే పరలోకగతురాలయింది.



పి. రుక్మిణీబాయిగారు

తండ్రిపోయినప్పటినుండి సంసారభారమంతా రామన్నమీదపడింది. ఈతనికి పధ్నెనిమిదవ ఏటనే భార్య కాపురానికొచ్చింది. మన రామన్న నవనాగరికుడగుటచేత తలిదండ్రులుపోగానే అర్చకత్వం మానేసి లౌకికంలోదిగినాడు. దేవునికి అర్చకత్వం చేయడానికి ఒక జీతగాడిని పెట్టాడు. తాను ఊళ్లో నోట్లు దస్తావేజులు మొదలైనవి వ్రాసి ఫీజు పుచ్చుకోడం ప్రారంభించాడు. ఊళ్లో ఎవరేవ్యవహారం చేసినా ఈయన సలహా లేకుండా చేసేవారు కారు. ఈవిధంగా గడించిన డబ్బుతో ఎప్పటి కప్పుడు కొండ్రకొనేసేవాడు.

"ఇదేమిపాపమండి! మీరు ఏవోనాల్గురాళ్లు సంపాదిస్తున్నారని సంతోషం లేకుండాను. చూశారా! సుబ్బమ్మకూడ నాతోటిదే కదా! దానికిద్దరు పిల్లలు. ఇది నాపూర్వకర్మసుకృతం నాపూజాఫలం. ఎప్పుడు తుమ్మపూవులతో పూజచేశానో

ఇప్పుడనుభవిస్తున్నాను. ఏదో తిండికి లోటులేదుగదా అని కాలక్షేపం చేద్దామంటే లేదు కదా? మనకిచ్చిన ఐశ్వర్యానికితోడు ఒకబిడ్డనుకూడా ఇవ్వరాదు, ఆ దేముడు. ఏమండీ మీరు తిరుపతివెంకటేశ్వర్లువారికి మ్రొక్కుకోండి మనకు బిడ్డపుట్టిన తర్వాత కొండెక్కుతామని. నేను అన్నవరంసత్యనారాయణకు నానాను మీదుకడతాను." అని రామన్న పంతులుతో ఇష్టాగోష్ఠిని మాట్లాడుకుంటూ చెప్పింది రాధమ్మ. ఔను ఔనని రామన్న పంతులు తిరుపతివెంకటేశ్వరుల వారికి మ్రొక్కుకొన్నాడు.

ఇట్లు కొంతకాలం గడిచింది. రామన్న రాధల అదృష్టంవల్లనో, లేక దేవుని కరుణాకటాక్షమువల్లనోకాని, రాధ గర్భవతి అయింది. నవమాసములు నిండిన తర్వాత ఆమె ఒక ఆడశిశువును కన్నది. రామన్నపంతులు, పుట్టక పుట్టినపిల్ల గదా అని సంతోషంతో బంధువులందరికి ఈశుభవార్త తెలియజేస్తూ పదకొండవనాడు బారసాలకు రావలసినదని కూడ ఉత్తరాలువ్రాశాడు. బారసాల చేస్తాడని తెలిసి ఊళ్లో మన పంతులు మోమోటస్థులు ఎవరికితోచింది వారు కానుకలు తీసుకొచ్చారు. ఎక్కడెక్కడి బంధువులు ఒచ్చారు. రామన్నపంతులు గృహం కలకలలాడుతూఉంది. పదకొండవరోజున బారసాలచేసి పిల్లకు "వెంకటసత్యసుందరి" అని నామకరణం చేశాడు. బారసాలంటే సామాన్యంగా చేశాడా. మనపంతులు గొప్ప పెళ్లి చేసినట్లుగా బారసాలయిన ఐదు రోజులు ఊళ్లోఉన్న అష్టాది వర్ణాలవారిని ఆహ్వానించి మృష్టాన్నం పెట్టాడు. కొద్దిగా మోమోటస్థుడన్న వాడికల్లా వస్త్రములు బహుమతీ చేశాడు.

బ్రహ్మానందంగా బారసాలయింది. బంధువులెవరింటికి వారేతెంచారు. సుందరి దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతోంది. సుందరినిచూచిన వారంతా పేరు సార్థకమయింది మాత్రమగునని సంతోషించేవారు. సుందరికి యుక్తవయస్సు వచ్చింది. పెళ్లిచేయాలి. ఆవుటకు వీలులేదని తొందరచేస్తోంది రాధమ్మ. పంతులు వరుని కొరకు తిరగడం ప్రారంభించాడు. తిరిగి తిరిగి వెయ్యిన్నూటపదహార్లుకట్నం ఇవ్వడానికి ఒప్పుకొని, తనదర్జాకు తగిన సంబంధమే స్థిరపర్చాడు. ముహూర్తంకూడా నిశ్చయించారు. పెళ్లికొడుకు కుర్రవాడు. బి. ఏ. చదువుచున్నాడు. ఏదో ఆస్తికూడ బాగానే ఉంది. మంచి సంబంధం కుదర్చాడని సంతోషించింది రాధమ్మ.

౨

సలక్షణంగా సుందరికి వివాహం అయింది. భర్త రాజమండ్రిలో చదువుచున్నాడు. అప్పుడప్పుడు నారాయణరావు మామగార్కి తాను క్షేమముగా ఉన్నట్లు ఉత్తరాలు

వ్రాసేవాడు వివాహమయి ఇంకా ఆరుమాసాలు పూర్తిగా కాలేదు. ఒకనాడు "మీ అల్లుడు నారాయణరావు నాల్గుదినములనుంచి కనబడుటలేదు. గోదావరిలో స్నానము చేయుచు మునిగిపోయాడని వదంతి" అని నారాయణరావు సహాధ్యాయులు పంపిన టెలిగ్రాముచూచి రామన్న పంతులు విస్మృతిజెంది పడిపోయాడు. రాధమ్మకూడ ఈ సంగతి వినగానే నిశ్చేతపోయి కడుపు, నోరు కొట్టుకొంటూ కొంపపడిపోయిందిరా దేముడా! అని గోలెత్తింది పాపము! రామన్న రాధలకు చాలరోజుల దాకా నిద్రాహారాలు లేవు. రామన్న పంతులుకిక అన్నిపనులందు విరక్తి కలిగింది. వీధిలోకి రావడం మానేశాడు.

ఈవిధంగా విచార సముద్రంలో మునిగిపోయి ఏపనిచేయడానికి తోచకుండా పిచ్చివానివలె తిరుగుతూఉన్నాడు రామన్నపంతులు. సుందరికి పదునాల్గవఏడు వచ్చింది. రజస్వల అయింది. రామన్న రాధల విచారం మరింత హెచ్చయింది. వారున్నది పల్లెటూరు గనుక, ఏబస్తీకో పోయిఉంటే ఈవిచారానికి మరుపు కలుగుతుందేమో అని అనుకొని దగ్గరగానున్న విజయనగరం చేరుకొన్నారు.

రామన్న రాధలకు కొంచెం పాతబడడంవల్ల అంత విచారంలేదు. సుందరిని చాలా గారాబంగా పెంచుతూ ఉన్నారు. సుందరి జ్ఞానంవచ్చిన పిల్ల అవడంచేత ఒకనాడురాత్రి తనలో తాను ఈవిధంగా ఆలోచించుకొని నిశ్చయించుకొంది. "అనాధనగు నాజన్మమునిరర్థకము, నిష్ప్రయోజనము. భూభారము తప్ప మరేమియులేదు. ప్రస్తుతము కలకత్తాలో ఉన్న అవతారపురుషుడైన గాంధిమహాత్ముని పాదసేవచేసిన నాజన్మతరించును. ఈ సంగతి నాతెలిదండ్రులకు తెలిపినచో వారు నన్ను విడుచుటకల్ల. అందుచే వారికి తెలియకుండ రాత్రిబండికి కలకత్తాపోవుదును." అని నిశ్చయించుకొని "నేను కలకత్తాపోవుచున్నాను" అని ఒక ఉత్తరము వ్రాసి తన పక్కమీదపెట్టి కలకత్తాకు పయనమయి వెళ్లింది. సుందరి ఇల్లువిడిచి వెళ్లిన కొంతసేపటికి, రామన్నకు మెళుకువవచ్చి సుందరి పడుకొనే పరుపువైపు చూచాడు. ఆమె ఉన్నట్లులేదు. దీపం వెలిగించి పరుపుదగ్గరకుపోయి చూచాడు. సుందరి కనబడలేదు గాని, "నేను కలకత్తాపోవుచున్నాను" అని వ్రాసిన కాగితంమాత్రంచూచాడు. తక్షణం రామన్న రైలుస్టేషనుకు పరుగెత్తి సుందరిని పట్టుకొని, "తల్లీ! నీవు దక్క మాకిక దిక్కెవ్వరున్నారు? మేముకూడ నీ యిష్టప్రకారము కలకత్తా వచ్చెదము. అక్కడేకాలక్షేపము చేయుదము" అని సుందరిని ఒప్పించి, ఇంటికి తీసుకొనివచ్చి, మరుచటిదినమున రామన్నరాధలు సుందరితో కలకత్తావెళ్లి అక్కడే కాలక్షేపంచేస్తూ ఉన్నారు.

## 3

ఆనందనగరానికి ఉత్తరంగా ఒక మహారణ్యం ఉంది. అక్కడనన మధ్యమున, ఒక మోటజాతిజనులున్నారు. వారు తమదేవుని ప్రీతికొరకు మనుజులను బలియిత్తురట. కొందరు మోసగాండ్రు ఆయడవిజాతిజనులవద్ద కొంతధనము తీసుకొని మోసగించి తెచ్చిన మనుష్యులను అమ్ముదురట. ఈ మోసగాండ్రు దేశదేశములు విలువగుదుస్తులను ధరించి తిరుగుచు ఏమాయకబుర్లో చెప్పిరో, తమతో కూడనుండు కాంతలవల్ల భ్రాంతి కల్గించిరో, మరి ఏవేవో భ్రాంతులు కలిగించి రంగూను తీసుకొనిపోయి ఆయడవిజనులకు విక్రయింతురట. చదువరులారా! నారాయణరావు గోదావరిలో మునిగిపోయెనని దురభిప్రాయపడి అతని స్నేహితు లంపిన టెలిగ్రాముపల్ల తప్పు అభిప్రాయపడితిమికాని, నిజముగా అతడు గోదావరిలో మునిగిపోలేదు. ఇతడుకూడ ఆనందనగర మోసగాండ్ర వలలో చిక్కి ఆనందనగరం గొంపోవబడ్డాడు. ఆనందనగరంలోనున్న మన దేశీయులవల్ల ఆమోసగాండ్రచరిత్ర తెలిసికొని, వారివద్దనుంచి తప్పించుకొని ఆనందనగరంలో మన దేశపు ఒక ఉద్యోగస్తుని ఇంటకొంతకాలము ఆమోసగాండ్ర కండ్లబడకుండా దాగి ఉన్నాడు.

దేశాభిమానము, సంఘాభిమానము ఎవరికుండదు? కొంతకాలమయిన తర్వాత ఆ ఉద్యోగస్తుని ద్రవ్యసాహాయ్యం చేతనే మనదేశం రావాలని బయలుదేరి ఓడెక్కి ఆనందనగరంనుంచి కలకత్తాచేరుకొన్నాడు. అక్కడ షాంబజారు వీధిలో హఠాత్తుగా మామగారయిన రామన్నపంతులుని చూచాడు. పలకరించబోయాడు. కాని తన మామ అక్కడకు రావడం ఎట్లా తటస్థించునని సందేహంతో వెనక్కితగ్గేడు. రామన్నపంతులు కూడ ఇతనినిచూచి తన అల్లునిజ్ఞప్తికి తెచ్చుకొని కళ్లనీరెట్టుకొన్నాడు. వారిద్దరికికూడా ఒకరిమొఖం ఒకరుచూచేసరికి ఏదో అనుమానం పీకులాడుతోంది. కాని ఒకరినొకరు మాట్లాడించుకోడానికి ధైర్యం చిక్కిందికాదు. అట్లావెనక్కితిరిగి చూచి విచారిస్తూ రామన్నపంతులు తన బసకువెళ్లాడు. నారాయణరావుకు అనుమానంతీరక ఆయన వెంటే వెళ్లి ఆయన బసలో తన అత్తగారిని భార్యనుకూడా చూచి కళ్లనీరెట్టుకొన్నాడు. ఇతనిని చూచి రాధ మహానందంతో నీవు చనిపోయావని మాకొచ్చిన టెలిగ్రాముపల్ల సర్వం త్యజించి ఇక్కడికి వచ్చాము, నీవు ఎక్కడికి వెడితివో సవిస్తరంగా చెప్పుమని ఆదుర్దాతో అడిగి తెలిసికొని వాళ్ల అదృష్టంవల్ల తిరిగి వచ్చాడని ఆమె పొందిన సంతోషానికి మేరేలేదు. నారాయణరావు తండ్రికి ఆరోజునే పంతులు ఈశుభవర్తమానం టెలిగ్రాముపల్ల తెలియపర్చాడు. మరుచటిరోజున అందరు కలకత్తానుండి తమ స్వగ్రామం చేరుకొన్నారు. సుముహూర్తం నిశ్చయించి ఆయావనదంపతులకు పునస్సంధానం చేశారు. వారిపుడు హాయిగా కాలక్షేపం చేస్తూఉన్నారు.